# బండరాళ్ళు

*బండరాళ్ళ బ్రతుకులన్నీ*
*ఎండిపోవు కాల్వదరిని*
*మండిరాలు బూదియడవి*
*లెండన్నను లేవ నెవరు*
*రండన్నను రానెవరో*

అని పాడుకుంటూ బోనగిరిరెడ్డి కొండపక్క అడివిలో వాగుపక్క బండరాతిమీదను కూర్చున్నాడు. అతడు కమ్యూనిస్టూ కాదు, కాంగ్రెసువాదీ కాదు. అతడు తెలంగాణా వీరుడు.

*తెలుగుతల్లీ! చెట్లతో జొంపాలతో*
*నిండిపోయిన పచ్చని కొండలుగలదానా!*

ఆకాశానికంటే ఒకటి రెండు బండరాళ్ళను కలిగి ఉన్న గుట్టలుగలదానా! జీవనదులు, ఎండిపోయిన వాగులూ ప్రవహించేదానా! కాకైనా చొరరాని కారడవులు గలదానా! సర్వలోహాలు, నవరత్నాలు, కారునలుపు రాక్షసి బొగ్గూ గర్భంలో దాచుకొన్నదానా! తెలుగుతల్లీ! మహోత్తమదేవీ! అమృత వాక్కులదానా! ఆనందపూర్ణ శిల్పజీవీ! దివ్యసాహిత్య పరులారా! బానిసత్వంలో క్రుంగిపోతూ స్వేచ్ఛకై వెతలు చెందేదానా! వేదనలు హారాలుగా ధరించిన తల్లీ! అవమానాలు కిరీటంగా శృంగారించుకొన్న దేవీ! నీవు బౌద్ధభిక్కునివా? – జైన సన్యాసివా? సౌందర్యపూర్ణ యౌవనాంగివా? నీ గుళ్ళు కూల్చబడి, నీ గోపురాలు తూల్చబడి, నీ శిల్పాలు ఖండింపబడి, నీ సాహిత్యాలు మండింపబడి, సౌష్టవపూర్ణమైన నీ బంగారు అంగాలు ఔషధాలకు లొంగని గాయాలుపడి నువ్వు మాయమాటలకు లొంగిపోయి, నువ్వు వేషమే మార్చుకొని స్వచ్ఛకాంతీయత ప్రజ్వలితమైన నీ సౌందర్యము బురఖాలో ముసుగుపడిపోయి, నీ బిడ్డలు పరభాషలకు, పరవేషాలకు సలాములు పెట్టి, ఎన్ని సంవత్సరాలు ఎన్ని శతాబ్దాలు –

ఈనాటికి మా ఆవేదన ఈ రజాకారు యుద్ధంగా పరిణమించి, తల్లీ ఈచేతికొక ఖడ్గాన్ని ప్రసాదించు!

*మాతా ఈ కంఠానికొక ఉరుమును అందించు!*
*సహోదరీ ఈ హృదయానికొక ధైర్యం కవచంచేయి!*

వీరపత్నీ! సుమంగళీ! తెలుగుతల్లీ, నా చూపులలో చండభాను తైక్ష్ణ్య కాంతులు ప్రసాదించు!

నా పెదవులకు ఆనంద హాసనృత్యము మాయం చేయించు! నేడు తెలుగుజాతి నశించడమో, నిజమయిన స్వాతంత్ర్యపథంలో విహరించడమో!

అని హృదయంలో అనుకొంటూ బోనగిరిరెడ్డి కళ్ళవెంట దొనదొన నీళ్లు కార్చినాడు.

## 2

**తె**లంగాణా వీరుడా! బోనగిరిరెడ్డీ! నీ కళ్ళయెదుట నీ చెల్లెలికి మానభంగమైనది. ఆమె నూతిలో పడి చచ్చిపోయినది. నీ భార్య మానభంగం కాకుండా తన హృదయ రక్తం జిమ్ముమని చిమ్మగా పొడుచుకొని నేల వాలింది.

నీకు దేశం వదలి తక్కిన ఆంధ్రసీమలకు పారిపోవడం ఇష్టంలేక పోయింది. నీగ్రామం తగులబడిపోయినా, నీపంటలు మంటగలిసినా, నీవాళ్ళ బ్రతుకులు కూలిపోయినా, అటు గాంధీజీమాటో, ఇటు నీ నాయకుల గర్జనో ధైర్యసాహసాలై ఈ అడవుల్లో, ఈ బండరాళ్ళమధ్య ఈ ఎండిపోయిన సెలయేళ్ళ ఇసుకలలో నిలువుకొన్నవి.

రజాకార్లను ఎదిరించినావో, రాక్షసులను హతమార్చినావో, సహధర్మ చారిణిని పోగొట్టుకొన్న ఒంటి సింహానివై పొదలలో, గుట్టలలో కదులాడుతూ, విదిలించిన కేసరిలా నడిరేయిని విరోధి శిబిరాలు దద్దరిల్లేటట్టు గర్జనచేస్తూ నిలుచుండినావు.

## 3

**బో**నగిరిరెడ్డికి సహాయంగా భారతీయ సేనలు పోలీసు యాక్షనుచేస్తూ వేంచేశాయి.

మూడురోజుల పట్టపగలులో 200 ఏళ్ళు వృద్ధిపొందిన ఆసఫ్షాహి దౌర్జన్యం అంతరించిపోయింది. అమ్మ పెట్టవలసిన నాలుగూ పెడితే అబ్బాయికి బుద్ధివచ్చింది.

భారతీయ హిందూజాతి హృదయంలో కక్షలు పెట్టుకునే జాతికాదు. ముస్లిం సహోదరుల హృదయం ఉద్రిక్తత పొంగు చల్లారింది. వారి దౌర్జన్యాలకు వారే సిగ్గుపడి పోయినారు,

భారతీయ సైన్యపు బందూకు మీదనుండి తెలంగాణ హిందూ ముస్లిం సహోదరులు చేయిచేయి పట్టుకొని "ఆదాబ్ అరజ్ – నమస్కారము" అనుకున్నారు కాని బోనగిరిరెడ్డి ఒంటరితనం పోలేదు.

ఓ బోనగిరిరెడ్డీ ఇటు కమ్యూనిస్టులు నీవు ఎరగని ఊహించలేని నాశనపూరితమైన దౌర్జన్యాన్ని రేకెత్తించి తెలుగునాడును దగ్ధపటలం చేస్తారే మోనన్న భయమూ ఆవరించింది.

అటు కాంగ్రెసు బురఖా తగిలించుకొన్న దొంగలు, దోపిడీగాంద్రూ, దేశముఖులు, కౌలుదార్లు ఈ నలుగురూ పూజ్యుడైన బాపూజీ పవిత్ర సత్యవ్రతాన్ని హింసకు ఎరజేసి తెలుగునాటి ప్రజల బ్రతుకులను ఎడారి ముంచేస్తారేమోనన్న అనుమానమూ కలిగింది.

ఒంటివాడవై నీ ఇంటికిపోతే ఇంటిలో మసలిన సహధర్మచారిణిలేదు. నీయిల్లే మంటగలిసి పోయింది. నీ భూములు ఇతరులాక్రమించి, నీపశువులు పచనము

గావింపబడి, నీ నాగలి ద్వేషపు భోగిమంటలో కలిసి, నువ్వు ఒంటి వాడవై నిట్టూరుస్తూ నీకు ఆశ్రయం ఇచ్చిన ఆ బండరాళ్ళ మధ్యకే మళ్ళీ వచ్చి నిలుచున్నావు.

నీ ఆస్తి తెలంగాణకు పాతగొంగళి. నీ పాస్తి అడవులలోని సీతాఫలపు పళ్ళు!

## 4

ఒకరోజున భోనగిరిరెడ్డి తాను అడవుల్లో సంపాదించుకున్న ఆపిదప కాలంనాటి సీతాఫలపుపళ్ళూ, కట్టెదు మోదుగాకు వరంగల్లు బజారుకువెళ్ళి అమ్ముకొని నల్లబజారులో సేకరించిన ఇన్ని జొన్నలు, ఇంత ఉప్పూ కారం పట్టుకొని ఆ ఒంటిమిట్టకు 15 మైళ్ళ దూరంలో వున్న తన మూడుమిట్టల స్వగ్రామానికి వచ్చాడు.

స్వగ్రామం అంటే అతని వెనకటి గ్రామంకాదు. తాను ఒంటిగా నివసించిన ఆ కొండపక్క బండరాళ్ళే అతని స్వగ్రామం. అక్కడే అతడొక చిన్నగుడిసె వేసుకున్నాడు. ఏటిలోకి ప్రవహించి వచ్చే చిన్న సన్నని ఊటకు అడ్డంకట్టి, చిట్టిగుంట నిర్మించుకొని ఆ నీటితో తడుపుకుంటూ ఆ బండరాళ్ళ దత్తుకొడుకు బోనగిరిరెడ్డి వ్యవసాయం చేస్తున్నాడు.

ఒకటి రెండు కూరగాయలైతే వరంగల్లుపోయి అమ్ముకునేవాడు. అతని కడుపుకింత అన్నంపెట్టిన తల్లులు సీతాఫలపుపళ్ళు, మోదుగాకు. అవి అమ్మగా వచ్చిన డబ్బులు అతని రొట్టెకు జొన్నపిండి ఇచ్చాయి. రుచికి ఉప్పూ కారాలిచ్చాయి, ఆ అడవిలోనే ఉన్న ఇన్ని చింతకాయలేరి తొక్కు చేసుకున్నాడు.

ఆనాడు సాయంత్రమింటికి చేరుకుంటూవుంటే దూరంగా తన ఇంటి దగ్గర ఏదో చిన్న మంట కనిపించింది. అమ్మయ్యో! యింకా తన బ్రతుకులో కష్టాల మెయిళ్లు చెదరిపోయి ఆకసము తేటపడలేదా అనుకున్నాడు. అనుకుంటూ ఒగర్చుకుంటూ ఒక్క పరుగులో ఇంటి దగ్గర వాలాడు. ఇంటి కెదురుగుండా మూడురాళ్ళు పొయ్యిగా పెట్టి ఒక స్త్రీ రొట్టె కాలుస్తోంది. అతడు తెల్లబోయి అలాగే నిలుచుండి ఎవరునువ్వు అని అడిగినాడు.

ఎవర్నినేను? ఆమె బదులు చెప్పినది.

"ఇక్కడ యేమిచేస్తుంటివి?"

"రొట్టె కాలుస్తున్నా అయ్యా! నీ బాంచను. కాలుమొక్కుతా."

"రొట్టెకుపిండి ఎక్కడిది. ఈ కుండమూకుడు ఎక్కడిది?"

"ఈ గుడిసెలోవుంటే పట్టుకొచ్చినాను తెలియక. పిండి ఆ చిల్లు కుండలోవుంటే తడిపి రొట్టె కాలుస్తున్నాను."

"ఇదేమిటి? అసలు నువ్వెవరంటే?"

"నే నెవర్నని చెప్పను అయ్యా? నే నెవర్నో! నాకు యాదుండేది? నా మగణ్ణి చంపినారు. నన్ను చెరిచినారు. బాదినారు. నేను పెయి తెలియక పడిపోయి, కండ్లు తెరిచేతలికి మా వూరు మండిపోబట్టింది. నేను చావక మిగిలినా. నావూరు నాకు యాదిలేదు. ఏదో తెరచాటు. ఈ వూరు ఆవూరూ బిచ్చమడిగి, ఈ కాయతిని ఆనీరు త్రాగి ఈడకు వచ్చినా. నీ బాంచను. కాలు మొక్కుతా!"

భోనగిరిరెడ్డి చెట్టుమోడులా అలా నిలుచుండిపోయినాడు. అతని కళ్ళవెంట దొన దొన బాష్పబిందువులు దిగి కారిపోయినాయి.

రజాకార్ల రాకాసిరాజ్యం పోయింది. ఇండియా యూనియన్ బందూకుపై నుండి హిందూ ముస్లిములు చేయి చేయి కలుపుకున్నారు.

ఓ తెలుగునాటి స్త్రీ! నీ హృదయంలో మాయరాని గాయాలు తగిలినవా? నీబ్రతుకు ఖండ ఖండాలుగా గొడ్డలివ్రేటుపాలై దుమ్ములో రాలి పోయిందా?

భోనగిరిరెడ్డి హృదయంలో ఆ స్త్రీ చిన్న బిడ్డలా దర్శనమిచ్చింది. ఏకాకిగా ఎవరూలేని ఎడారిలో ఎలుగెత్తి ఏడ్చే పసిపాపలా కనిపించింది. తన్ను చూచి నిల్చున్న ఆ స్త్రీని పైకి ఉబికి రాలేని వెక్కి వెక్కి ఏడ్పుతో అతడు తన హృదయానికి గాఢంగా అదుముకున్నాడు.

"ఓ ఆడదానా! తల్లీ తండ్రీ భర్తా బిడ్డా చుట్టమూ దైవమూలేని ఓతెలుగునాటి ఆడదానా! ఈ బండరాళ్ళమధ్య ఈ కొండపక్క ఈ ఎండిపోయిన వాగుదరిని ఈ గుడిసెలో అన్నీ మరచి ఒళ్ళు తెలియక నిదురపో. ఒక కొత్త పొద్దులో కళ్ళు తెరిచి కొత్తరంగులుచూచి ఆనందించు. కొత్త సుగంధాలు వాసనచూస్తూ మైమరచిపో" అన్నాడు.

## 5

**భో**నగిరిరెడ్డి పేరులేని ఆ తెలుగునాటి స్త్రీకి ఒరంగలు బజారులో దొరికిన ఒక ముతకచీర ఒక ముతకరైక కొనుక్కు వచ్చాడు. అంత యుద్ధంలోనూ అతనిచేతిని దండకడియాలు పోలేదు. అన్ని అమ్మి బండరాళ్ళ మధ్య నిలుచున్న ఒంటివాడైన తన గుడిసె ప్రాంగణానికి దిక్కు తెలియక తన్ను మరచి నడిచివచ్చిన ఆ తెలుగునాటి స్త్రీకి కొనుక్కు వచ్చినాడు.

ఆ చీర అప్పుడే వికసిస్తున్న మోదుగుపువ్వుల ఎరుపు చీర.

ఆ రైక ఆనాటి నిర్మలాకాశపు నీలి రైక. దాని అంచులు చివుళ్ళు తొడిగి యవ్వనం తాల్చే ఇప్పచెట్టు పచ్చని ఆకురంగు.

ఆ బండరాళ్ళలో నవ్యాశామూర్తియైన భోనగిరిరెడ్డి, నవ్యశక్తి స్వరూపిణియైన ఆ తెలుగునాటి స్త్రీ ఈ సంక్రాంతి ఉదయంలో ఒక నూత్న యుగ ప్రవేశం గమనిస్తూ నిలుచున్నారు.

రెండు వందల సంవత్సరాలనాటి కాలము వెనక వేసుకొని నూత్న సౌందర్యము అలంకరించుకొన్న ఓ తెలుగునాటి స్త్రీ ఎండిపోయిన నీ దేహ సౌష్టవ సౌందర్యము నూతనార్ద్రత సముపార్జించుకొని నీ కాలి ముందు సెలయేరు కొత్తనీటి ప్రవాహాల నిండి నీ తెలుగునాడు ఇటు తూర్పు తీరము అటు మంజీర తీరాలుదాటి నీ తెలుగురెడ్డి బ్రతుకును పాలసముద్రము చేస్తుందా?

కొండవాగు పక్కన బండరాళ్ళు, పూరి గుడిసె పక్కన యెదదపొంగి అంచులు చాపుకుంటూ కిలకిలమనే భోనగిరిరెడ్డి సాగుచేసిన పొలం.

కొండపక్క అడవిలో వాగుపక్క బండరాతిమీద తెలుగునాటి ఆడుబిడ్డా, కొండపక్కన అడవిలో వాగుపక్క బండరాళ్ళు. ●